క్లుప్తంగా

స్కూల్ గేమ్స్ జిల్లా వాలీబాల్ టీంలోకి లోకేష్‌రెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగ వాలీబాల్ టీంకు హర్ష ఐఐటీ–మెడికల్ అకాడమీ సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి బి. లోకేష్‌రెడ్డి ఎంపికైనట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టు ఎంపికలో భాగంగా జిల్లా జట్టుకు ఎంపికైన లోకేష్‌రెడ్డిని అభినందించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడాంశాల్లో నైపుణ్యం సాధించే విధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉంటారని వివరించారు. ప్రిన్సిపాల్ కె.బాబ్జీ మాట్లాడుతూ విద్యార్థులను క్రీడా శిక్షణ ద్వారా క్రీడాపోటీలకు పంపుతున్నామని తెలిపారు.

సీపీఆర్ చేసి రోగి ప్రాణాలు కాపాడవచ్చు



గుంటూరు ఎడ్యుకేషన్: గుండె నొప్పికి గురైన బాధితుల కాపాడటంలో అత్యంత కీలకమైన సీపీఆర్‌పై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని గుంటూరు మెడికల్ కళాశాల అనస్థీషియా విభాగ వైద్య నిపుణులు డాక్టర్ ప్రదీప్ పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గుంటూరు మెడికల్ కళాశాల నుంచి వచ్చిన వైద్యులు ప్రదీప్, తనూజ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణరక్షణక సీపీఆర్ పని చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డోర్కా, అధ్యాపకులు పద్మజ, విజయశ్రీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇద్దరు ప్లానింగ్ సెక్రెటరీలపై సస్పెన్షన్ వేటు

నెహ్రూనగర్: కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సస్పెండ్ చేశారు. 55వ సచివాలయంలో పనిచేస్తున్న జె.గిరిబాబు 121వ సచివాలయంలో పనిచేస్తున్న ఎ.జీవన్ ప్రభు కళ్యాణ్ లు అనుమతి లేకుండా సమీక్ష సమావేశాలకు హాజరు కాకపోవడం, పట్టణ ప్రణాళిక విభాగ క్షేత్ర స్థాయి విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడంపై గురువారం విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

గుంటూరు లీగల్: హత్య కేసులో దాసరి వీరయ్య లియాస్ చుక్కపల్లి వీరయ్యకు రిమాండ్ విధించినట్లు ఆరోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎడవూరు గ్రామానికి చెందిన కుర్రా నాగగణేష్ హత్య కేసులో దాసరి వీరయ్య ప్రమేయం ఉందంటూ నేరారోపణ ఉన్న క్రమంలో 8వ నిందితుడిగా గుర్తిస్తూ పోలీసులు అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో కోర్టులో వాద ప్రతివాదనల అనంతరం వీరయ్యను 14 రోజుల వరకు రిమాండ్ విధించారు. వీరయ్యను పోలీసులు రేపల్లె జైలుకు తరలించారు.

స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ

లక్ష్మీపురం: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ కల్పించడం జరుగుతుందని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు గురువారం తెలిపారు. సెల్ ఫోన్ రిపేర్, సర్వీసెస్, జూట్ ఉత్పత్తుల తయారీ శిక్షణ నవంబరు 3 నుండి, టైలరింగ్ కోర్స్ నవంబరు 17నుండి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాకు ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం కల్పించడం జరుగుతోందన్నారు. పదవ తరగతి చదివి, 19 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ వివరాలను యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు కాపీ, ఆధారకార్డు కాపీ, నాలుగు పాస్పోర్ట్ సైజు ఫోటోలు, 10 వ తరగతి విద్యార్హత కాపీని గుంటూరు, కొత్తపేట, ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 08632336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

లక్షలు పోసి.. లక్ష్యం మరిచారు!



గుంటూరు నగరంలో ప్లాస్టిక్ నియంత్రణకు ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు ఏనీ టైం బ్యాగ్ పేరుతో మిషన్‌ను కొన్ని లక్షలు వెచ్చించి రెండు తెప్పించారు. రూ.20 వేస్తే క్లాత్ బ్యాగ్ వస్తుందని చెప్పి వాటిని గాంధీ పార్కు వద్ద, ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఉంచారు. వీటి వినియోగంపై ప్రజలకు ఆశించిన స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో వాటిని తీసుకువచ్చి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పక్కన పెట్టేశారు. ప్రజల సొమ్ముతో ఇలా దుర్వినియోగం పనులు చేయవద్దంటూ నగర వాసులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

–నెహ్రూనగర్

టీచరమ్మగా.. కలెక్టరమ్మ



గుంటూరు గ్రామీణ మండలం లాలుపురం నేతాజీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకటవ తరగతి విద్యార్థుల హాజరు పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య, హాజరు, గైర్హాజరు విద్యార్థుల వివరాలు యాప్‌లో తనిఖీ చేశారు. రగతి గదిలో ఉన్న బోధనోపకరణాలను గూర్చి అడుగగా స్వయంగా తయారు చేసి విద్యార్థుల బోధనకు ఉపయోగించడం జరుగుతుందని వివరించగా సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేశారు.

– లక్ష్మీపురం

అమ్మో..ఖాళీ స్థలాలు !



నగరంలోని ఖాళీ స్థలాలు స్థానిక ప్రజలను నరకయాతనకు గురిచేస్తున్నాయి. ఏళ్ల తరబడిగా స్థల యాజమానులు అందుబాటులో ఉండకపోవడంతో, ఫోన్ల నంబర్లు తెలియకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. 34వ డివిజన్ కోబాల్టుపేట ఎనిమిదో వీధిలోని పీకలవాగు వంతెన సమీపంలో ఓ ఖాళీ స్థలం ఉంది. అందులో రకరకాల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో రాత్రివేళల్లో ఇళ్లల్లోకి దోమలు, పురుగులు, విష సర్పాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం ఇంటి ఆవరణలోకి సర్పం వచ్చిందని ఓ మహిళ తెలిపింది. చాన్నాళ్లుగా స్థల యాజమాని అందుబాటులో ఉండడం లేదు. చివరికి పిచ్చిమొక్కలు తొలగించాలని స్థానిక సచివాలయంలో, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఎటువంటి ప్రయోజనం లేదని వాపోయారు.

– నగరంపాలెం

మీ–సేవకు వెళ్లండి!

- అక్కడ దరఖాస్తు చేసుకోండి
- సచివాలయ సిబ్బంది హితవు
- దూరమైన పౌర సేవలు



నెహ్రూనగర్‌లోని సచివాలయం

నెహ్రూనగర్: గుంటూరు నగరం 56వ డివిజన్‌కు చెందిన అనిల్ కుమార్ తన కుమారుడి బర్త్ సర్టిఫికేట్‌లో స్పెల్లింగ్ మిస్టేక్స్‌ను సరి చేసుకునేందుకు సచివాలయానికి వెళ్లాడు. అయితే అక్కడి సచివాలయ సిబ్బంది గత వారం రోజుల నుంచి సర్వర్ అప్‌డేట్ కారణంగా పౌర సేవలు నిలిచిపోయాయని మీరు దగ్గరలోని మీ సేవ కేంద్రానికి వెళ్లాలని సూచించడంతో చేసేదేమి లేక మీ సేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు.

జగనన్న హయాంలో అలా....

గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకు పౌర సేవలను అందించే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అందులో సెక్రటరీలను నియమించారు. వీరికి అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు వారి ఇంటి వద్ద నుంచే పొందే విధంగా.. కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలను తప్పించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నింది. గత వారం రోజుల నుంచి సర్వర్ పనిచేయడం లేదంటూ సచివాలయ సిబ్బంది సచివాలయానికి వచ్చిన నగర వాసులను తిప్పి పంపుతున్నారు. మీ సేవాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఇది రాష్ట్ర సమస్య

సచివాలయాల్లో సర్వర్ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. దానికి నగరపాలక సంస్థ సిబ్బంది ఏమి చేయలేరు. ప్రభుత్వమే సర్వర్ సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంటుంది.

– చల్లా ఓబులేసు, అదనపు కమిషనర్

పేద ప్రజల మేలు కోసం పోరాడతాం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల
- మంగళదాస్‌నగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



సంతకాలు చేయిస్తున్న శ్యామల, నూరిఫాతిమా



మాట్లాడుతున్న శ్యామల

పట్నంబజారు: పేద ప్రజలకు మేలు జరగడం కోసం ఎంతటి పోరాటాలకు వెనుకాడేది లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల స్పష్టం చేశారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా గురువారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో కాకాని రోడ్డులోని మంగళదాస్ నగర్‌లో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా శ్యామల మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ కూటమి ప్రభుత్వం దురాలోచనకు వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి వేసిన అడ్డుకట్ట అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకత చూస్తుంటే కోటికంటే ఎక్కువ సంతకాలు నమోదయ్యే అవకాశం కనిపిస్తోందన్నారు. వై.ఎస్.జగన్ తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను ప్రజలు వారి ఆస్తిగా భావించారని, కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. తమ పిల్లలు వైద్య విద్యనభ్యసించి వైద్యులు కావాలని అనేకమంది తల్లిదండ్రులు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. విద్య, వైద్యం అనేవి కనీస అవసరాలు అనే విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలన్నారు. కూటమి పాలనలో వైద్య విద్య అందని ద్రాక్ష మాదిరిగా మారుతోందన్నారు. వైఎస్ జగన్ చేసిన మంచి కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వై.ఎస్. జగనన్న నాయకత్వంలో ఆరోగ్యశ్రీ ప్రతి పేదవారికి ఒక పెద్ద ఆసరాగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీని పాతాళానికి తొక్కారని మండి పడ్డారు. ఖచ్చితంగా ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆరోగ్యశ్రీ అంటే ఒక సంజీవిని అనే విషయాన్ని కూటమి ప్రభుత్వం మరవడం సిగ్గుచేటన్నారు. కూటమి పాలనలో ప్రజలు వారి ఆరోగ్యం పట్ల సందిగ్ధంలో ఉన్నారన్నారు. ప్రజలకు మంచి జరిగే వరకు వైఎస్సార్ సీపీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటుదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, జిల్లా, నగర కమిటీ నేతలు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల తరగతులు జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

లక్ష్మీపురం: నెల్లూరు జక్కా వెంకయ్య భవనంలో నవంబరు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న రజక వృత్తిదారుల రాజకీయ చైతన్య తరగతులు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు కోరారు. పాత గుంటూరు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద గురువారం మండూరు వెంకట నరసయ్య అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ సమావేశంలో రాజకీయ చైతన్య తరగతులు కరపత్రాలు ఆవిష్కరించారు. సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల నేరవేర్చాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. 50 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి రజక వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలల కాలం పూర్తయినప్పటికీ కేవలం మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి హామీలు అమలు జరపకుండగా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రజక మహిళలపై అత్యాచార, హత్యలు కొనసాగడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి వెంపాటి చిన్న కొండయ్య (సీతయ్య), ఫణిదపు కోటేశ్వరరావు, బెండమూరి లంక కైలాసం, అద్దంకి సాంబశివరావు, సత్తెనపల్లి శ్రీనివాసరావు, బెండమూరి లంక సుబ్రహ్మణ్యం, దిడ్డల వెంకటేశ్వరరావు, లంక శ్రీను, ధరణికోట వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్మికులకు గ్రీవెన్స్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు శుక్రవారం సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు.

రెండోరోజు కొనసాగిన నాటకోత్సవాలు

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తోన్న నారా చంద్రబాబు నాటకోత్సవం–2025 గురువారం రెండో రోజుకి చేరాయి. మంత్రిత్వ సాంస్కృతిక కేంద్రం, ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి అభినయ (పొనుగు పాడు), ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరగ్గా, అతిధులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ సభాధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ఆరాధ్యుల తేజస్విప్రఖ్య కూచిపూడి నృత్య ప్రదర్శన చేపట్టారు. అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి దర్శకత్వం వహించిన ఎవరు, డి.వినయ దర్శకత్వం వహించిన ఆచమనం నాటికలను ప్రదర్శించారు. సభికులను ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో అభినయ నిర్వాహకులు శ్రీనివాస్, ఏపీ స్టేట్ రేరా సభ్యులు దామచర్ల శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి పిఆర్.రాజు, అభినయ థియేటర్ ట్రస్ట్ సలహాదారులు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, టీడీపీ మహిళా అధికార ప్రతినిధి (నరసరావుపేట) కనుమూరి అనంత లక్ష్మీ, రచయితలు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, కొరిటాల ప్రభాకరరావు (విశాఖపటనం), విష్ణుమొలకల రామకృష్ణ పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఆదర్శం కలాం జీవితం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశభక్తి, మానవత్వం సమ్మిళితమైన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని బ్లూ టిక్ కమ్యూనికేషన్ సీఈవో, జర్నలిజం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాము పేర్కొన్నారు. గురువారం మువ్వా చిన్నపాపి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో అమరావతి రోడ్డులోని గోల్డ్ ఏజ్ హోంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 95వ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ రాము హాజరై ప్రసంగించారు.

అవగాహనతో పక్షవాతాన్ని జయించవచ్చు

ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: నాకు మొదటిసారి పక్షవాతం వచ్చిన తర్వాత డాక్టర్ల సూచనలతో కోలుకున్నా. కానీ కొంతకాలానికి ఆరోగ్యం బాగుందనిభావించి మందులు తీసుకోవడం మానేశా. దాని ఫలితంగా రెండోసారి పక్షవాతం వచ్చింది. పక్షవాతం వచ్చిన తరువాత కూడా, జీవితాంతం ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి, మందులు ఏరోజూ మానవద్దు.. అంటూ ఓ పక్షవాత రోగి తను అనుభవాన్ని పంచుకున్నారు. నాకు హఠాత్తుగా ఒకవైపు చేతికి, కాలికీ బలహీనత వచ్చింది, మాట బాగారాలేదు. నా కుటుంబం వెంటనే స్పందించి లలితా హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. లలితా హాస్పటల్ స్ట్రోక్ యూనిట్ టీం 10 నిమిషాల్లో సీటీ స్కాన్ చేసి వెంటనే క్లాట్ బస్టింగ్ ఇంజెక్షన్ (త్రాంబోలైసిస్) ఇచ్చారు. కొన్ని రోజుల్లోనే మళ్ళీ సాధారణ జీవితం ప్రారంభించగలిగాను. ఇప్పుడు నేను నా పనులన్నీ నేనే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉన్నా. 'గోల్డెన్ అవర్'లో (పక్షవాతం వచ్చిన తరువాత మొదటి 4.5 గంటల కాలం) లో చికిత్స పొందితే ఎలా జీవితం మారవచ్చో మరో కోలుకున్న వ్యక్తి తన జీవిత అనుభవాన్ని పంచుకున్నారు. స్ట్రోక్‌పై (పక్షవాతం) ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధిని పూర్తిగా జయించవచ్చని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 29న ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) అక్టోబర్ నెలను పక్షవాత అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం లలితాగ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట లలితా హాస్పిటల్ అంకినీడు స్ట్రోక్ యూనిట్‌లో పక్షవాతం నుంచి జయించిన హీరోల చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరమ్మ, డాక్టర్ రేష్మ, డాక్టర్ ఉషా కిరణ్ బెహరా, డాక్టర్ అజ్మానాజ్, సైకియాట్రిస్ట్ అజయ్, సైకాలజిస్ట్ సరోజ పాల్గొన్నారు.

23లోగా ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తు చేసుకోండి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లే అవుట్స్, ప్లాట్స్‌ని ఈ నెల 23వ తేదీలోపు లే అవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)లో దరఖాస్తు చేసుకోవాలని, చేసుకోని వాటిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలోని అనధికార లే అవుట్స్ ఎల్‌ఆర్‌ఎస్‌కి దరఖాస్తు చేసుకునేలా ప్లానింగ్ కార్యదర్శి వారికి తెలియచేయాలని, అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పెండింగ్‌లో ఉంచకుండా ఫార్వార్డ్ చేయాలన్నారు. 23వ తేదీ తర్వాత డిప్యూటీ కమిషనర్లతో ప్రత్యేక తనిఖీలు చేపడతామని, అందులో అనధికార లే అవుట్స్ గుర్తిస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, టీపీబీఓలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయం పరిధిలో అనధికార నిర్మాణాలను లిస్టు సిద్ధం చేసుకొని, వాటికి నిర్దేశిత గడువు మేరకు నోటీసులు ఇవ్వాలని, గడువు అనంతరం కూల్చివేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. బీపీఎస్ చట్టం పరిధిలోకి వచ్చే వాటి లిస్టు వేరుగా చేసి, గైడ్ లైన్స్ వచ్చిన అనంతరం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో, డ్రెయిన్లు, రోడ్ల ఆక్రమణలు చేస్తుంటే కార్యదర్శులు, అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం సరికాదని, అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో విధులకు ఆటంకం కలిగించే వారిపై పోలీసు కేసులు నమోదు చేయించాలన్నారు. శుక్రవారం నుంచి అనధికార నిర్మాణాలకు నోటీసులపై ప్రతిరోజు నివేదిక ఇవ్వాలన్నారు. అనధికార హోర్డింగ్స్‌ని తక్షణం తొలగించాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు, టీపీఎస్‌లు, టీపీబీఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

24 వరకు పిల్లలకు ఉచితంగా కంటి పరీక్షలు

గుంటూరు మెడికల్: దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా కాల్చే సమయంలో 14 సంవత్సరాలోపు పిల్లలకు కంటికి సంబంధించిన సమస్యలు తలెత్తితే ఈనెల 16 నుంచి 24వ వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామని వాసన్ ఐకేర్ హాస్పటల్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జాగర్లమూడి అనిల్ శేష్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బాణాసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల్ని కంటికి రెప్పల కాపాడుకోవాలని వారు సూచించారు. గురువారం స్థానిక కొత్తపేట శివాలయం ఎదురుగా ఉన్న వాసన్ ఐ కేర్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు ఉచిత కంటి పరీక్షల పోస్టర్ను ఆవిష్కరించారు.

భూసార పరీక్ష ఫలితాల కార్డుల పంపిణీ

గుంటూరు రూరల్: మండలంలోని బుడంపాడు గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షా ఫలితాల కార్డుల పంపిణీ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ మాట్లాడు తూ రైతులకు భూసార ఫలితాల కార్డుల ప్రాధాన్యత గురించి వివరించారు. భూసార ఫలితాల ఆధారంగా వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం, జీవ ఎరువుల వినియోగం, వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకా లు గురించి రైతులకు అవగాహన కల్పించారు. వరి పంట వేసిన రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను అమ్ముకోవాలనుకుంటే, వారు తప్పనిసరిగా ఆర్ఎస్కే కేంద్రాలలో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వే, పంట నమోదు చేయని రైతులు తక్షణమే ఆర్ఎస్కే కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా... సమస్యలు ఆలకించవూ...!

- గుంటూరులో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి
- నవంబర్ 3 నుంచి మున్సిపల్ సమ్మెకు సన్నాహాలు



మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం గుంటూరులోని లాలాపేట హిమనీ సెంటర్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినూత్నంగా వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట మాలాద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా విధుల్లో నిర్వహిస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులను ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 12వ పి.ఆర్.సి ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలు, డి.ఏ సత్వరం విడుదల చేయాలని కోరారు. డైలీవేజ్ కార్మికులను ఔట్ సోర్సింగ్‌లోకి తీసుకోవడం, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల బ్యాంక్ ఖాతాలను బలవంతంగా యాక్సిస్ బ్యాంక్‌లోకి మార్చే ప్రయత్నాలను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో చినబోతుల వెంకటరావు, ఉపాధ్యక్షుడు బట్టు సద్గుణ రావు, సహాయ కార్యదర్శి మిర్యాల కోటేశ్వరరావు, పూర్ణ, బాలమ్మ, దుర్గమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ అవసరం

లక్ష్మీపురం: బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ వాక్సినేషన్ అవసరమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. గురువారం నగరంలోని విజ్ఞాన్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. రోటరీ క్లబ్ సమాజంలోని అనేక రుగ్మతలను రూపుమాపడానికి విశేష కృషి చేస్తుందన్నారు. పోలియో నిర్మూలన, క్యాన్సర్ నివారణ వంటి అంశాల మీద రోటరీ చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. జబ్బులు వచ్చిన తర్వాత నివారణకు వైద్యం తీసుకునే కన్నా... జబ్బులు రాకుండా జాగ్రత్త పడటం ఉత్తమమని, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 1332 మంది బాలికలకు వ్యాక్సిన్ వేయటం ఆనందంగా ఉందని చెప్పారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను రోటరీ క్లబ్ మరింత విస్తృత పరచాలని సూచించారు. రోటరీ క్లబ్ 3150 గవర్నర్ డాక్టర్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ భారత దేశంలో పోలియో నివారణకు రోటరీ క్లబ్ వేల కోట్ల రూపాయలను వెచ్చించి వ్యాక్సిన్ తెప్పించి ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలబాలికలకు వ్యాక్సిన్ వేయడం వలన నేడు భారతదేశంలో పోలియోను రూపుమాపగలిగామన్నారు.